సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 13 । జనవరి । 2024



ఏలూరుకు ర్యాంకు

స్వచ్ఛ సర్వేక్షన్-2023లో ఏలూరు నగరపాలక సంస్థ ఉత్తమ పని తీరుతో ర్యాంకును మెరుగుపరుచుకుంది.

10లో ▸



శ్రీవారి కొండపై..

ద్వారకాతిరుమల శ్రీవారి కొండపైన హరిత హోటల్ వద్ద చిల్డ్రన్స్ అడ్వెంచర్ పార్కును శుక్రవారం ప్రారంభించారు.

10లో ▸



శోభాయమానంగా..

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీవారి గ్రామోత్సవం శోభాయమానంగా సాగింది. ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఊరేగించారు.

న్యూస్‌రీల్

ఎంపీ అభ్యర్థిని కలిసిన ఎమ్మెల్యేలు



సునీల్‌కుమార్ యాదవ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, వాసుబాబు

దెందులూరు: ఏలూరు పార్లమెంటరీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నియమితులైన కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను ఆయన నివాసంలో ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి (దెందులూరు), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు) మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ అభ్యర్థిగా నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు



అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో సమగ్ర అంతర్ జిల్లాల చెక్‌పోస్టులను రెండు రోజుల్లో ఏర్పాటుచేసి, 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ, మండల అధికారులతో కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ప్రస్తుతం ఐదు చెక్ పోస్టులు ఏర్పాటుచేయాలన్నారు. యలమంచిలి మండలం చించినాడ, భీమవరం మండలం లోసరి, పెనుగొండ మండలం సిద్ధాంతం, ఆకివీడు మండలం దుంపగడప, తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లిలో వెంటనే చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. మద్యం, నగదు, బహుమతులు తదితరాలపై నిఘా పెంచాలన్నారు. చెక్‌పోస్టుల్లో తనిఖీపై ప్రతి శనివారం పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

సైన్స్ ఫెస్టివల్‌కు ఆహ్వానం



ఆర్‌వీ సూర్యనారాయణ

ఇరగవరం: కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఇరగవరం హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఆర్‌వీ సూర్యనారాయణకు ఆహ్వానం అందింది. వైజ్ఞానిక సైన్స్ లిటరేచర్ ఈవెంట్‌కు డెలిగేట్‌గా వర్తమాన సైన్స్ అంశాలపై చర్చించనున్నారు. 9వ అంతర్జాతీయ ఫెస్టివల్, సైన్స్ అండ్ టెక్నాలజీ, పబ్లిక్ అవుట్‌రీచ్ ఇన్ అమృత్ కాల్ అనే అంశంపై నేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫరీదాబాద్‌లో ఈనెల 17 నుంచి 20 వరకు జరుగనున్న అంతర్జాతీయ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌కు శాస్త్రవేత్తలతో పాటు భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సూర్యనారాయణను ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, డీఈఓ ఆర్‌వీ రమణ, హెచ్ఎం జి.నాగమ్మ, గ్రామస్తులు అభినందించారు.

సెలవుపై వెళ్లిన కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం నుంచి ఈనెల 16 వరకు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. అప్పటివరకు జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

మది నిండుగా.. పెద్ద పండుగ

సంక్రాంతి.. తెలుగింట పెద్ద పండుగ.. సంస్కృతి, సంప్రదాయాలను శోభాయమానంగా చూపించే పల్లె పండుగ.. మూడు రోజులపాటు అలరించే సంక్రాంతి వస్తుందంటే నెల రోజుల ముందు నుంచే ఊరూవాడా ముస్తాబవుతుంది.. మది నిండుగా సంతోషంతో పెద్దలు, పిల్లాపాపలతో గడిపేందుకు అందరూ స్వస్థలాల బాట పడుతున్నారు. రహదారులు రద్దీగా మారగా.. మార్కెట్‌లు కిటకిటలాడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సంక్రాంతి శోభ కనిపిస్తోంది.

సంక్రాంతి శోభ
- స్వస్థలాలకు వస్తున్న జనం
- ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిట
- విద్యాసంస్థల్లో సంబరాలు
- భోగిమంటలకు ఏర్పాట్లు
- మార్కెట్లకు పండుగ కళ



తాడేపల్లిగూడెంలో సంక్రాంతి సంబరాలు



భీమవరంలోని వస్త్ర దుకాణంలో రద్దీ

సాక్షి, భీమవరం: గత నెల 16న సూర్యుడు ధనురాశిలోకి ప్రవేశించడంతో గ్రామాల్లో నెలగంట మోగింది. తెలతెలవారుతూనే హరినామ సంకీర్తనలతో హరిదాసులు, ముత్యాల ముగ్గులతో ఇంటి ముంగిళ్లను తీర్చిదిద్దే ఆడపడుచులు, అయ్యగారి దండం పెడుతూ డూడూ బసవన్నలు చేసే విన్యాసాలు, పప్పుదాకలో పడిపోతున్నానంటూ కూనిరాగాలు తీసే కొమ్మదాసులు, ఎప్పుడెప్పుడు పండుగ.. ఏడాది పండుగ అంటూ భోగిమంటలకు పిడకల వేటలో చిన్నారులు సందడి మొదలైంది. మహిళలు ఇళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

నంబరాలు.. సం'కాంత్రు'లు

నాలుగు రోజులుగా జిల్లాలో ఎక్కడ చూసినా సంక్రాంతి కోలాహలమే కనిపిస్తోంది. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. భోగి మంటలు, గంగిరెద్దు, హరిదాసులు, కోయదాసులు, కొమ్మదాసులు తదితర సంప్రదాయ కళాకారుల ప్రదర్శనల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు.

ప్రజలంతా పల్లెల బాట : పండుగల కోసం స్వగ్రామాలకు వచ్చే వారితో బస్సులు కిక్కిరిస్తున్నాయి. జిల్లా కేంద్రం భీమవరంతో పాటు నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. భోగి ఆదివారం, సంక్రాంతి సోమవారం రాగా రెండో శనివారం కలిసిరావడంతో దూరప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చే వారు శుక్రవారం రాత్రి బయలుదేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. బుధవారం ముక్కనుమతో పండుగలు ముగుస్తున్నా అధిక శాతం మంది వచ్చే ఆదివారం తిరుగు ప్రయాణానికి రిజర్వేషన్లు చేయించుకున్నారు. ఇళ్లకు వచ్చే మనుమల కోసం అమ్మమ్మలు భోగిపిడకలు సిద్ధం చేశారు. మార్కెట్‌లో రెడీమేడ్ భోగిపిడకల దండల అమ్మకాలు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక్కో దండ రూ.50 నుంచి రూ. 70లు వరకు విక్రయిస్తున్నారు. కొత్తగా పెళ్లయిన ఇంట అల్లుళ్లకు చేయాల్సిన మర్యాదలు, పెట్టిపోతలపై ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.



రెడీమేడ్ భోగిపిడకల దండలు



పాలకొల్లు బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

రద్దీగా మార్కెట్లు : పండుగలకు ఒక్క రోజు మాత్రమే ఉండటంతో జిల్లాలో వాణిజ్య కేంద్రాలుగా పేరొందిన భీమవరంలోని జువ్వలపాలెం రోడ్డు, మల్టీప్లెక్స్ ఏరియా, డీఎన్ఆర్ కళాశాల రోడ్డు, నాచువారి సెంటర్, తణుకులోని రాష్ట్రపతి రోడ్డు, పాలకొల్లులోని బస్టాండ్ సెంటర్, నరసాపురంలోని స్టీమర్ రోడ్, తాడేపల్లిగూడెం వన్‌టౌన్‌లోని కేఎన్ రోడ్డు, తాలుకా ఆఫీస్ రోడ్డు ప్రజలతో మరింత రద్దీగా మారిపోయాయి. మాల్స్, మార్ట్‌లతో పాటు షోరూంలు, చిన్న దుకాణాల్లో వస్త్ర, బంగారం, కిరాణా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి

కోడిపందేలకు సన్నద్ధం : కోడిపందేల నిర్వహణకు పందెంరాయుళ్లు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని పెద అమిరం, సీసలి, దుంపగడప, మహదేవపట్నం తదితర ప్రాంతాల్లో పందేల నిర్వహణ ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. మరోపక్క బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే అతిథుల కోసం ఇప్పటికే భీమవరం, పరిసరాల్లోని లాడ్జీలు, హోటళ్లలోని గదులు అడ్వాన్స్ బుకింగ్‌లతో నిండిపోయాయి. ఏసీ, డీలక్స్, సూట్ రూమ్‌లను బట్టి రోజుకు రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతున్నాయి.

నరసాపురం-హుబ్లి ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం: నరసాపురం-హుబ్లి మధ్య కొత్తగా ప్రవేశపెట్టిన హుబ్లి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీస్ ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం నరసాపురం రైల్వేస్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు జెండా ఊపి ఈ రైలు సర్వీసును ప్రారంభించారు. ఈ రైలు గతంలో హుబ్లి-విజయవాడ మధ్య నడిచేది. విజయవాడ నుంచి కొత్తగా నరసాపురం వరకు రైలు సర్వీసును పొడిగించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ గోవా వెళ్లే ప్రయాణికులకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. నరసాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకారాలు అందిస్తుందని తెలిపారు. స్టేషన్ సూపరింటెండెంట్ దివాకర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఈ రైలు 17225 నంబర్‌తో నరసాపురంలో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.20 గంటలకు హుబ్లి చేరుకుంటుందని చెప్పారు. 17226 నంబర్‌తో మధ్యాహ్నం 1.20 గంటలకు హుబ్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7 గంటలకు నరసాపురం చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, రైల్వే అధికారులు ఏడీఆర్ఎం శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, టీఆర్‌యూసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు.

– అమరావతి

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

భీమవరం: పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే అంబేడ్కర్‌కు మనమిచ్చే గౌరవమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సామాజిక సమతా సంకల్పం మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సీఎం జగన్ అంబేడ్కర్ ఐడియాలజీ అందరికీ తెలిపేలా విజయవాడలో విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు అంబేడ్కర్ మార్గంలో నడుస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ విజయవాడలో 125 అడుగుల ఎత్తుగల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సుమారు రూ.450 కోట్ల వ్యయంతో సీఎం జగన్ ఏర్పాటుచేస్తున్నారన్నారు. విద్యార్థుల కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలన సాగిస్తోందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్.అగ్రహారంలో సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజాప్రతినిధిగా గెలుపొందిన తర్వాత ఏనాడైనా, ఎవరైనా, ఎప్పుడైనా ప్రజల బాగోగులు, కష్టసుఖాలను అడిగితెలుసుకున్నారా? అని ప్రశ్నించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 16, 17 నెలలుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి ఆరు నెలలకు పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. రాష్ట్రంలో 66.50 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులకు నెలకు రూ.2 వేల కోట్లు అందిస్తున్నామన్నారు. నాడు డ్వాక్రా రుణమాఫీ పేరుతో చంద్రబాబు మహిళలను వంచిస్తే.. సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత హామీ మేరకు సున్నావడ్డీ, రుణమాఫీ అమలు చేస్తున్నారన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల ద్వారా అండగా నిలుస్తున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం సేకరిస్తోందన్నారు.

సుపరిపాలన చూసి ఓర్వలేక.. రాష్ట్రంలో సీఎం జగన్ సుపరిపాలన చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని డిప్యూటీ సీఎం కొట్టు మండిపడ్డారు. 2014 ఎన్నికల్లో పవన్ మాట నమ్మి చంద్రబాబుకు ఓటేస్తే ఏం చేశాడని ప్రశ్నించారు. పవన్‌ను డబ్బులతో చంద్రబాబు లోబర్చుకున్నాడని విమర్శించారు. బీసీలను ఏనాడూ చంద్రబాబు గుర్తించిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నాడు జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు వర్తించేవని దుయ్యబట్టారు. అయితే జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నామని, బీసీ డిక్లరేషన్ ప్రకటించి, కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికైనా ప్రజలు మంచి ఆలోచనతో సుపరిపాలనకు జగనన్నకు మరలా మద్దతు పలకాలని కోరారు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మలపల్లిలో లక్ష్మణేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అమలాపురం ఎంపీ చింతా అనూరాధ వినతిపత్రం అందించగా డిప్యూటీ సీఎం కొట్టు అనుమతి మంజూరు చేశారు.



ఎల్.అగ్రహారంలో పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

పెనుగొండలో టీడీపీకి షాక్



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

పెనుగొండ: పెనుగొండ బాపూజీపురానికి చెందిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు టీడీపీకి షాక్ ఇచ్చారు. శుక్రవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఖండవల్లి బాబూరావు ఆధ్వర్యంలో 50 మందికి పైగా కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు పేదల రక్తాన్ని దోచుకున్నాయని.. నేడు వైఎస్సార్ సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అమలు చేస్తుండటంతో పేదలంతా సీఎం జగన్‌కు అండగా నిలుస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో ఖండవల్లి బాబూరావు, తొత్తరముడి చిట్టియ్య, మంద రత్నంరాజు, మంద మోషే, మందసతీష్, ఖండవల్లి సుగుణరావు, మంద కిషోర్, దిగుమర్తి రవీంద్ర, దిగుమర్తి మహేష్ బాబు, కొండేపూడి శ్రీను, మంద సతీష్, ఖండవల్లి చందు, మంద నవీన్, దిగుమర్తి వాణి, దిగుమర్తి తేజ, మంద అనిల్, మంద సుమంత్, గెద్దాడ సుభాష్, కొండేటి క్రాంతి, చెవ్వేటి సన్నీ, తొత్తడమూడి సురేష్, మంద సునీత, మంద అనంతలక్ష్మీ, నామవరపు ఎస్తేరు, దిగుమర్తి పెద సుగుణమ్మ, కొండేపూడి బుల్లి బుజ్జి, ఖండవల్లి సీతమ్మ, ఖండవల్లి బేబీ, దిగుమర్తి కమలమ్మ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ పలివెల శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలపై ఉక్కుపాదం

జూదాలపై స్పెషల్ ఫోకస్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిషేధాజ్ఞలు
- 209 కేసుల్లో 1,133 మంది అరెస్ట్
- 1,400కు మందికిపైగా బైండోవర్ కేసుల నమోదు
- ఏలూరు రేంజ్ పరిధిలో రూ.34.52 లక్షలు స్వాధీనం

సాక్షిప్రతినిధి, ఏలూరు: సంక్రాంతి నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే కోడిపందేలపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. సంప్రదాయ క్రీడ పేరుతో కోడిపందేలు పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో కోడిపందేల కట్టడికి జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు కోడి కత్తులు తయారు చేసి నిర్వాహకులపై కేసులు, పేకాట నిర్వాహకులపైన కేసులు నమోదు ప్రక్రియ రెండు వారాల నుంచి కొనసాగిస్తున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు పోలీస్ జిల్లాల్లో ఇప్పటి వరకు 9,400 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.



రావిచర్లలో బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు

స్పెషల్ యాక్షన్ ప్లాన్ : ఏలూరు రేంజ్ పరిధిలో కోడిపందేల కట్టడికి పోలీసులు స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. స్టేషన్ల పరిధిలో కోడిపందేలు, పేకాట, గుండాటలు పండుగ రోజుల్లో నిర్వహిస్తే సంబంధిత ఎస్సై, సీఐలను బాధ్యులను చేసి సస్పెండ్ చేస్తామని రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. దీంతో పాటు ఆరు జిల్లాల ఎస్పీలతో సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో కట్టడి చేయడంతో పాటు యువతను క్రికెట్, వాలీబాల్, ఇతర క్రీడలవైపు మళ్లించేలా సబ్‌డివిజన్ల వారీగా టోర్నమెంట్లు నిర్వహించాలని ఆదేశించారు.

9 వేలకుపైగా కేసులు : ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు పోలీస్ జిల్లాల్లో 479 కేసులు నమోదు చేసి 2,437 మందిని అరెస్టు చేశారు. అలాగే 6,140 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. 75 వాహనాలను, 11 మొబైల్స్‌ను, రూ.34.52 లక్షలను సీజ్ చేశారు.

కోడిపందేలపై ఉక్కుపాదం

కోడిపందేలు నిర్వహిస్తున్న నిర్వాహకులు, గతంలో నిర్వహించిన వారిపైనా కేసులు నమోదు చేశారు. రేంజ్ పరిధిలో 111 కేసులు నమోదు చేసి 471 మందిని అరెస్టు చేసి 3,311 మందిపై బైండోవర్లు, 161 పందెంకోళ్లు, 2,140 కోడి కత్తులు, 45 వాహనాలను సీజ్ చేశారు. అలాగే కోడి కత్తులకు పదును పెట్టే ఎనిమిది యూనిట్లను సీజ్ చేసి 10 మొబైల్ ఫోన్లు, రూ.4.09 లక్షలను సీజ్ చేశారు.

కఠిన చర్యలు తప్పవు



రేంజ్ పరిధిలో కోడిపందేలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. అలాగే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తాం. యువత వీటికి దూరంగా ఉండి సంప్రదాయ క్రీడల్లో పాల్గొని సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలి. ముఖ్యంగా కోడిపందేలకు దూరంగా ఉండాలి.

– జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ ఐజీ

కేసులు ఇలా..

- ఏలూరు జిల్లాలో 134 కేసుల్లో 729 మంది అరెస్టు చేసి 373 మందిని బైండోవర్ చేసి రూ.10.70 లక్షలను పేకాటరాయుళ్ల నుంచి సీజ్ చేశారు.
- అలాగే 49 కేసుల్లో 215 మంది అరెస్టు చేసి 120 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి 70 కోళ్లు, 1,546 కత్తులు రూ.1.17 లక్షలను కోడిపందేల నిర్వాహకుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.
- పశ్చిమగోదావరి జిల్లాల్లో 75 కేసుల్లో 404 మందిని అరెస్టు చేసి 1,095 మందిని బైండోవర్ చేసి 39 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి రూ.7.81 లక్షలను పేకాటరాయుళ్ల నుంచి సీజ్ చేశారు.
- 12 కేసుల్లో 43 మందిని అరెస్టు చేసి 769 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి 16 కోళ్లు, 74 కత్తులు, 11 ద్విచక్రవాహనాలు, రూ.28 వేలను సీజ్ చేశారు.

క్లుప్తంగా

6 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న ఎస్సై సుధాకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో గంజాయిని తరలిస్తున్న ఆరుగురు యువకులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్సై సుధాకరరెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం పట్టణ శివారు పాలిటెక్నిక్ కళాశాల వద్ద గంజాయిని తరలిస్తున్నారని సమాచారం రావడంతో సీఐ నాగరాజు తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. అక్కడి చేరుకున్న ఎస్సై సుధాకరరెడ్డి ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 6 కిలోల గంజాయిని, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

17న అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం, విశాఖపట్నంలోని తిరుమల విద్యాసంస్థల్లో ఐదు నుంచి పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈనెల 17న ఉదయం 10.00 గంటలకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకునే తల్లిదండ్రులు, విద్యార్థులు రాజమహేంద్రవరం క్యాంపస్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తిరుమల ఈడీయూ.కామ్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విశాఖపట్నం క్యాంపస్‌లో జరిగే సదస్సుకు హాజరుకావాలనుకునేవారు ఆ క్యాంపస్‌లో అదే తేదీన నేరుగా సంప్రదించవచ్చన్నారు. 2023లో ఐఐటీ/ఎన్ఐటీ/ఐఐఐటీ/బిట్స్‌లలో 646 మంది విద్యార్థులు సీట్లు సాధించారని, ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 233 మందిలో 14మంది ఎయిమ్స్‌లో సీట్లు సాధించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అత్తిలి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ అత్తిలిలో షేక్ వలీకి చెందిన మాంసం దుకాణంలో పని చేస్తాడు. శుక్రవారం ఉదయం మస్తాన్ పిప్పర గ్రామం నుంచి అత్తిలి బయలుదేరాడు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు వచ్చేసరికి అత్తిలి నుంచి పిప్పర వైపు బైక్‌పై వెళుతున్న అత్తిలి గ్రామానికి చెందిన రేగాని దుర్గారావు రాంగ్ రూట్‌లో వెళ్లి మస్తాన్ బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో మస్తాన్(32) తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో తణుకు పట్టణంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో దుర్గారావుకు గాయాలుకావడంతో వైద్య సేవల నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు మృతుని భార్య షేక్ యాస్మిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎస్.వెంకట్రావు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏలూరుకు ర్యాంకు

- మెరుగైన పనితీరుతో ఓడీఎఫ్ ప్లస్
- రాష్ట్రంలో 12వ స్థానానికి ఏలూరు
- జాతీయస్థాయిలో 223వ ర్యాంకు



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఏలూరు టౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ఏలూరు నగరపాలక సంస్థ ఉత్తమ పని తీరుతో ర్యాంకును మెరుగుపరచుకుంది. జాతీయస్థాయిలో ఏకంగా వంద స్థానాలు ఎగబాకింది. రాష్ట్రస్థాయిలో 13 స్థానాలు మెరుగుపరచుకుని గుర్తింపు సాధించింది. గతేడాది కాలంగా ఏలూరు కార్పొరేషన్‌లో క్లీన్ ఏలూరు సాధనకు అధికారులు, కార్మికులు విశేష కృషి చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ పనితీరుతో గణనీయమైన మార్పునకు నాంది పలికింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎనిమిది ప్రామాణికాల్లో ఆరింటిలో అద్భుతమైన పురోగతి సాధించింది.

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో

జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ఏలూరు నగరపాలక సంస్థ గణనీయమైన మార్పులతో ర్యాంకు సాధించింది. గత ఫలితాలతో పోల్చితే ఏలూరు నగరం 100 స్థానాలను మెరుగుపరచుకోవటం విశేషం. ఏలూరు నగరానికి జాతీయ స్థాయిలో గతంలో 325 ర్యాంకు ఉండగా తాజాగా 223 స్థానానికి చేరటం సంతృప్తికరంగా మారింది. ఇక రాష్ట్రంలో లక్షకు పైబడి జనాభా కలిగిన నగరాల్లో ఏలూరు గతంలో 25వ స్థానంలో ఉంటే తాజాగా 12వ స్థానానికి చేరుకోవటం అధికారులు, సిబ్బంది పని తీరుకు నిదర్శనంగా చెప్పుకోవాలి.

తొలిసారిగా ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపు

ఏలూరు తొలిసారిగా బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం విశేషం. నగరంలో ప్రతి ఇంట్లోనూ మరుగుదొడ్లు ఉండడం, బహిరంగ మలవిసర్జన రహితంగా చేయటం, ఇళ్లలోని వ్యర్థాలను జాగ్రత్తగా తొలగించడం వంటి వాటిలో మెరుగైన పనితీరుతో గుర్తింపు సాధించింది.

ఆరు అంశాల్లో పురోగతి

ఏలూరు నగరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 8 అంశాల్లో కేవలం రెండింటిలో మాత్రమే వెనుకబడి ఉండగా మిగిలిన ఆరింటిలోనూ మంచి ప్రతిభను చాటుకుంది. ఇంటింటా చెత్త సేకరణలో 98 శాతం, ఇంటి వద్దనే చెత్త విభజన (తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త)లో 55 శాతం, నివాసిత ప్రాంతాల్లో శానిటేషన్ 99 శాతం, మార్కెట్ ప్రాంతాల్లో శానిటేషన్ 99 శాతం, తాగునీటి చెరువల వద్ద పారిశుద్ధ్యం 100 శాతం, టాయిలెట్లలో శానిటేషన్ 83 శాతం మెరుగైన పనితీరు కనబరిచింది. ముఖ్యంగా గత 50 ఏళ్లగా పేరుకుపోయిన చెత్తను ప్రాసెస్ చేయటం, చెత్తను విద్యుత్ లేదా శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయడంలో పూర్తిగా విఫలమైంది. ఇక సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ వంటి వాటిలో 14 శాతం పనితీరుతో వెనుకబడింది.

ఏలూరుకు గుర్తింపు



ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని సారథ్యంలో ఏలూరు నగరపాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుర్తింపు సాధించింది. నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని క్లీన్ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఏలూరు ర్యాంకు సాధించడం విశేషం. గతంతో పోల్చితే గణనీయమైన మార్పునకు అవకాశం ఏర్పడింది. నగర ప్రజలు సహకారంతో ఏలూరును మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు, క్లీన్ ఏలూరుగా పేరు తెచ్చుకునేలా కష్టపడి పని చేస్తాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం



సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పామర్తి అచ్యుత్ గౌడ్

దెందులూరు : బీసీలను బ్యాక్‌బోన్‌గా భావించి ఆ మాటను క్షేత్రస్థాయిలో అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర ఉన్నంత కాలం బీసీలందరి మదిలో నిలిచి ఉంటారని గౌడ సంఘం స్టీరింగ్ కమిటీ రాష్ట్ర నాయకులు పామర్తి అచ్యుత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిలో గౌడ సంఘం తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాలుగున్నరేళ్లల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి రాజ్యసభకు పంపడమే కాకుండా పెనమలూరులో జోగి రమేష్, రేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈపూరి రమేష్, పెదన ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉప్పాడ రాము, రాజమండ్రి ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్గాని భరత్‌కు సీట్లు ఇవ్వడం గౌడ కులస్తులతో పాటు బీసీలందరికి గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల్లో 16 మంది బీసీలున్నారన్నారు. బీసీలంతా సీఎం జగన్‌తోనే వైఎస్సార్ సీపీకి మద్దతుగానే ఉంటారన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు సప్పా మురళీ, సాధం కిషోర్ ఉన్నారు.

కోళ్లకూ ఉందో పంచాంగం

- పందేనికి కోళ్లు సిద్ధం
- కుక్కుట శాస్త్రానికి పెరిగిన డిమాండ్
- నక్షత్రాల వారీగా లెక్కలు వేసుకుంటున్న పందెంరాయుళ్లు



డేగ



సేతువ



కాకి దగ్గర పర్ల

తాడేపల్లిగూడెం: మానవులకు శాస్త్రాలు, పంచాంగాలు, ఉన్నట్టే కోళ్లకు ప్రత్యేక పంచాంగం ఉంది. బరిలో ఏ రంగు కోడి గెలుస్తుంది? ఏ రంగు కోడి ఓడిపోతుంది? ఇవన్నీ కుక్కుట శాస్త్రంలో ఉంటాయి. పందేలు వేసే వారికి కుక్కుట శాస్త్రం ఒక ఆయుధమని పందేల ఔత్సాహికులు చెబుతూ ఉంటారు. కాబట్టి కుక్కుట శాస్త్రం ప్రకారం ఈ సంక్రాంతి ఏయే రకాల కోడి పుంజులు బరిలో గెలుస్తాయనే అంచనాలు వేస్తున్నారు. కోడిపుంజును సంస్కృతంలో కుక్కుటం అంటారు. రాచరికాల కాలంలో పౌరుషాలకు చిహ్నంగా కోడి పందేలు సాగేవి. ప్రస్తుత రోజుల్లో సంప్రదాయాల్లో భాగంగా సంక్రాంతికి కోడిపందేలు జరగడం ఆనవాయితీగా మారింది. పందేల మోజు నేపథ్యంలో పుంజుల పెంపకం దగ్గర నుంచి పందేల వరకూ ప్రజల విశ్వాసాల మాదిరిగానే కోడి పందేలలో పంచాంగం, నక్షత్రాల ప్రభావం పడింది. దీన్ని నుంచి వచ్చిందే కుక్కుట శాస్త్రం. ఈ శాస్త్రంలో కోడి ఈకల రంగును కొట్టి పుంజుల పేర్లను వర్గీకరించారు.

నక్షత్రాలకు అనుగుణంగా గెలుపోటములు

ఈ ఏడాది సంక్రాంతిలో ముఖ్యంగా మూడు రోజుల నక్షత్రాలను పరిశీలిస్తే భోగి రోజున ధనిష్ఠ నక్షత్రానికి పసుపు రంగు డేగ, సంక్రాంతికి శతభిషం కాకి, కనుమ పూర్వాభాద్ర నెమలి రంగు కోళ్లు విజయం సాధించే అవకాశం ఉందని పందెంరాయుళ్లు చెబుతున్నారు.

దిశలకు అనుగుణంగా పందేలు

ఆదివారం ఉత్తర దిశ, సోమవారం దక్షిణ దిశ, మంగళవారం తూర్పు ముఖంగా పందేలు వేస్తే విజయం సాధిస్తాయని పందెంరాయుళ్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బరిలోకి పెరూ పుంజులు

దేశవాళీ పందేలకు ఈసారి బరిలో పెరూ జాతి పుంజులు దింపుతున్నారు. భారతీయ పుంజులతో పెరూ పెట్టలను సంకరపర్చి ఓ జాతిని అభివృద్ధి చేశారు. ఇవే పెరూ పుంజులుగా ప్రాచుర్యం పొందాయి. పుంజులకు ఈ సారి నాస్తా లడ్డు పేరిట ఆయుర్వేద గుళికలు ఇస్తున్నారు.

శ్రీవారి కొండపై చిల్డ్రన్స్ అడ్వెంచర్ పార్క్

- ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహణ
- చిన్నారులకు ఆహ్లాదం కలిగించేలా ఆట వస్తువులు



ఏపీ టూరిజం హోటల్, రిసార్ట్స్ వద్ద చిల్డ్రన్స్ అడ్వెంచర్ పార్క్‌ను ప్రారంభిస్తున్న శ్రీవారి దేవస్థానం ఈఓ త్రినాథరావు



జోకర్ ఉయ్యాల, వాటర్ పూల్



ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన ఏపీ టూరిజం హరిత హోటల్, రిసార్ట్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ అడ్వెంచర్ పార్క్‌ను చినవెంకన్న దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఆయన సతీమణి భాగ్యలక్ష్మితో కలసి స్వామి వారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానందా విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేశారు. ఆ తరువాత రిబ్బన్ కట్ చేసి పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు పార్క్‌లోని ట్రైన్ జోకర్ ఉయ్యాల, హెలికాప్టర్లు, రంగులరాట్నం, ట్రాంప్లేన్, మేరీ గ్రౌండ వాటర్ పూల్, బౌన్సర్‌లతో ఎంతో ఉత్సాహంగా ఆటలాడారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన చిన్నారులకు, అలాగే క్షేత్రానికి వచ్చే యాత్రికుల పిల్లలకు ఈ పార్క్ అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ఈ పార్క్ ఏర్పాటుతో పిల్లలకు ఆటవిడుపు, టూరిజానికి మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం భీమడోలుకు చెందిన పార్క్ నిర్వాహకుడు గౌతమ్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మాత్రమే ఈ పార్క్ తెరిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక హరిత రిసార్ట్స్ మేనేజర్ కొట్టు మురళి, సిబ్బంది పడవల మోహన్‌బాబు, పెరవలి చిన్నవెంకన్న, పి.అచ్యుతకుమార్ తదితరులున్నారు.

కనులపండువగా కుడార్సై



గంగాళాలతో అక్కాల్ వడిసెల్ సమర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో 27వ రోజు 'కుడార్సై' మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అందంగా తీర్చిదిద్దిన ముగ్గులో 108 గంగాళాలతో 'అక్కార్ వడిసల్' ప్రత్యేక ప్రసాదాన్ని గోదా సమేత శ్రీ రంగనాథ స్వామికి నివేదనగా సమర్పించారు. అనంతరం తిరుప్పావై పాశుర అర్థాన్ని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గోదా, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయమాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ, అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు పాల్గొన్నారు.

• నమ్మకం..అమ్మకం



గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. అయితే సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగి రోజున భోగి మంటలు వేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ భోగి మంటల్లో ఆవు పేడతో చేసిన పిడకలు వేస్తే మంచిదని చాలా మంది చెబుతూ ఉంటారు. సరిగ్గా ఈ నమ్మకాన్నే పెన్నాడపాలేనికి చెందిన పాము రాంబాబు ఆదాయ వనరుగా మార్చుకున్నాడు. ముందుగానే సిద్ధం చేసుకున్న భోగి పిడకలను దండలుగా కట్టి పాలకోడేరు మండలంలోని గొరగనమూడిలో ఇంటింటికీ తిరుగుతూ అమ్ముతున్నాడు.

– పాలకోడేరు

ఆక్వా రైతులు విద్యుత్ రాయితీకి దరఖాస్తు చేసుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీకే సుబ్బరాజు

వీరవాసరం: ఆక్వా రైతులు విద్యుత్ రాయితీల కోసం దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఆక్వా కల్చరల్ డెవలప్‌మెంట్ అథారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీకే సుబ్బరాజు చెప్పారు. మేరకు శుక్రవారం తులసి కన్వెన్షన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కొంతమంది రైతులు ఆక్వా సాగుకు సంబంధించిన వివరాలను సాంకేతిక లోపంతో ఆక్వా చెరువుగా మ్యాపింగ్ జరగలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డె రఘురామ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. 10 ఎకరాల లోపు రైతులు విద్యుత్ రాయితీ పొందడానికి అర్హులన్నారు. రైతులు స్థానిక ఫిషరీస్ అధికారులను కలిసి దీనికి సంబంధించిన విధి విధానాలను తెలుసుకోవాలని కోరారు. రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డె రఘురామ్‌కు రాష్ట్ర క్యాబినెట్ హోదా కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మళ్ల రాంబాబు, నాగరాజు గోపాలకృష్ణంరాజు, యరకరాజు గోపాలకృష్ణంరాజు, భోగిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా త్రో బాల్ సెలెక్షన్స్



త్రో బాల్ సెలెక్షన్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పశ్చిమ గోదావరి జిల్లా త్రో బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ త్రో బాల్ సెలెక్స్ శుక్రవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. విజేతల వివరాలను జిల్లా ప్రెసిడెంట్ సీహెచ్ఏఆర్‌కే వర్మ, జనరల్ సెక్రటరీ ఎస్.ఎం శ్రీనాథ్‌లు ప్రకటించారు. క్రీడాకారులను ఈ నెల 27,28 తేదీలలో మదనపల్లిలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. బాలురు విభాగంలో పి.నరేంద్ర, సుధీర్, సీహెచ్ నివాస్, ఎం.ఈశ్వర్, అశోక్, సాయి కుమార్, పవన్, మనోజ్‌కుమార్, నవీన్, అజయ్‌కుమార్, రవితేజ, రత్నకుమార్, ధరణి కుమార్, బాలికల విభాగంలో హారిక, రమ్య, రాణి, కేదారేశ్వరి, రత్నకుమారి, సునీత, జయప్రభ, పద్మావతి, హిమదుర్గ, లక్ష్మీప్రసన్న, కౌశల్య తదితరులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న గొరగనమూడి హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి హైస్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఈ నెల 3 నుంచి 10 వరకూ ఢిల్లీలో నిర్వహించిన 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రతినిధ్యం వహించారని స్వామి జ్ఞానానంద హైస్కూల్ హెచ్‌ఎం బి.శ్రీదేవి తెలిపారు. ఈ పాఠశాల నుంచి అండర్ 14 విభాగంలో ఎం.ఎస్తేరు, ఎస్.గంగాభవానీ, ఎస్.విలియం, అండర్ 17 విభాగంలో కె.మానస, టి.ఉమాభవానీ, కె.లోకేష్‌లు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాణించి జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు వెళ్లారన్నారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మిని, విద్యార్థులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, గొట్టుముక్కల శివాజీరాజు, మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామ పారిశుద్ధ్యంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు మరువలేనివని సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని జగన్నాథపురం పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాలు వేయరాదని కోరారు. ఇళ్లలోని చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందించి, గ్రామ పారిశుద్ధ్యానికి ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం పలువురు వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ సీఐగా నాగేశ్వరరావు



తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు

తణుకు: తణుకు రూరల్ సీఐగా జీవీవీ నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన నాగేశ్వరరావు సాధారణ బదిలీల్లో భాగంగా తణుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు. ఈయన స్థానంలో సీఐగా పని చేసిన సీహెచ్ ఆంజనేయులు రావులపాలెం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆంజనేయులుకు వీడ్కోలు చెప్పిన అధికారులు, పోలీసు సిబ్బంది నాగేశ్వరరావును అభినందించారు. సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గోదాదేవి అమ్మవారికి కుడారై ఉత్సవం



బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయంలో తిరుప్పావై పఠనం చేస్తున్న భక్తులు

అత్తిలి: ధనుర్మాసం సందర్భంగా అత్తిలి మండలం బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవి అమ్మవారికి కుడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువ జామున ఆండాళ్ ఘోష్టి సభ్యులచే తిరుప్పావై పఠనం చేశారు. మారంగంటి శ్రీమన్నారాయణ గురుత్వంలో అండలూరి శ్రీనివాసాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో కుడారై ఉత్సవాన్ని జరిపారు. ఈసందర్భంగా అమ్మవారికి 108 గంగాళాలతో క్షీరాన్న ప్రసాదాన్ని నివేదించారు. స్వామి, అమ్మవార్లకు నక్షత్ర హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి త్రినాథ్, ట్రస్టుబోర్డు చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం ఇస్తున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకే కాక అగ్ర వర్ణాలలో ఉన్న పేదలకు కూడా సముచిత స్థానం కల్పించారని చెప్పారు. ఎస్సీలకు పెద్ద పీట వేసి, దళితుల పక్షపాతిగా ఉన్నారని కొనియాడారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు నాయకులు పి.బాలకృష్ణ, కె.రాజారావు, కె.మునలయ్య పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో గణితంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి విద్యార్థులకు గణిత దీక్షా మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు పరీక్షల్లో గణితంలో భయాన్ని పోగొట్టి సులువుగా నేర్చుకునేలా బొమ్మలు, ముఖ్యమైన సమస్యల పరిష్కారాలతో మెటీరియల్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. మెటీరియల్ అన్ని పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు అందజేస్తామన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ తణుకు నియోజకవర్గం



అత్తిలిలో రూ. 32 కోట్ల నిధులతో నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు



ఇరగవరంలో రూ. 2 కోట్లు నిధులతో నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు

- పరుగులు పెడుతున్న అభివృద్ధి పనులు
- నిర్మాణంలో ఉన్న ప్రధాన రహదారులు
- నియోజకవర్గంలో రూ.1000కోట్లు దాటిన అభివృద్ధి

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటికే భవనాల నిర్మాణాలు పూర్తికాగా రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రూ. 1000 కోట్లు నిధులతో వివిధ శాఖలకు సంబంధించి తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో అభివృద్ధి పనులు పోటాపోటీగా జరుగుతున్నాయి. దీంతో ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో...

తణుకు నియోజకవర్గంలో 2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు తణుకు మున్సిపాలిటీ, ఆర్ అండ్ బీ, జిల్లా పరిషత్, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ శాఖ, విద్యుత్ శాఖలకు సంబంధించి రూ. వెయ్యి కోట్లు పనుల్లో 90 శాతం పూర్తికాగా మిగిలిన 10 శాతం పనులు జరుగుతున్నాయి. రహదారులు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాల్స్, తాగునీరు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లు, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీ భవనాలు, పార్కులు, విద్యుత్ సబ్ స్టేషన్‌లు, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫారమ్స్ వంటివి నిర్మాణం చేశారు.

అత్తిలిలో రూ. 32 కోట్లుతో ఆర్ అండ్ బీ రోడ్డు

ముఖ్యంగా తణుకు నియోజకవర్గంలోని ఇరగవరం మండలం గవర్లపాలెం నుంచి పాలకోడేరు మండలం కోరుకొల్లు వరకు అత్తిలి మీదుగా రూ. 32కోట్లు నిధులతో ఆర్ అండ్ బీ విభాగంలో జరుగుతున్న రహదారి నిర్మాణం పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 14 కిలోమీటర్లు మేర అత్తిలి గ్రామ పరిధిలో 770 మీటర్లు సిమెంట్ రోడ్డు, మిగిలిన 13,230 మీటర్లు తారు రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రధాన రహదారిని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత 18 మీటర్ల రోడ్డును 21 మీటర్లకు పెంచి వైండింగ్ చేస్తున్నారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావు వేయించిన రోడ్లుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి మరమ్మతులు చేయించకపోవడంతో ఈ రహదారి పూర్తిగా శిథిలమైపోయింది. ఇప్పుడు మళ్లీ తాజాగా మంత్రి కారుమూరి రూ. 32 కోట్లు నిధులు మంజూరు చేయించి రహదారిని అభివృద్ధి చేయిస్తున్నారు. అలాగే ఇరగవరం గ్రామ ప్రధాన రహదారిని 18 మీటర్ల నుంచి 21 మీటర్లకు పెంచి రూ. 2.50 కోట్లుతో కొంతమేర సిమెంట్ రోడ్డు, మరికొంత ఏరియా తారురోడ్డుగా మలుస్తున్నారు.

అభివృద్ధికి చిరునామా మంత్రి కారుమూరి



అత్తిలిలో రూ. 32 కోట్లు నిధులతో నిర్మాణం జరుగుతున్న సిమెంట్ రోడ్డు, తారురోడ్డు ఒక మైలురాయి. 2009 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాత్రమే అత్తిలిలో రహదారులు నిర్మాణం చేశారు. మళ్లీ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయనే రహదారుల నిర్మాణాలు చేయిస్తున్నారు. టీడీపీ హయాంలో దోచుకో దాచుకో అన్న విధంగా పరిపాలన చేశారు.

– పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు

టీడీపీ హయాంలో అభివృద్ధే లేదు



ఇరగవరం ప్రధాన రహదారిని రూ. 2.50కోట్లు నిధులతో సిమెంట్, తారురోడ్డుగా నిర్మాణం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణలో పనులు నాణ్యంగా జరుగుతున్నాయి. ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి చేయకపోవడంతో రహదారులు గుంతలుగా మారాయి. జగనన్న ప్రభుత్వంలో మళ్లీ రహదారులను అభివృద్ధి చేస్తున్నారు.

– కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల అధ్యక్షుడు

మున్సిపాలిటీలో రూ. 300 కోట్లతో అభివృద్ధి



జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తరువాత తణుకు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు రూ. 300కోట్లు పైగా నిధులతో రహదారులు, డ్రెయినేజీలు, సచివాలయ భవనాలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు. విద్యుత్ శాఖకు సంబంధించి కూడా అవసరమైన చోట్ల సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫారమ్స్, విద్యుత్ స్థంభాలు వేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చొరవ చూపిన ఘనత మంత్రి కారుమూరికే దక్కుతుంది.

– మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు

ఎల్లాప్రగడ సేవలు చిరస్మరణీయం

తాడేపల్లిగూడెం అర్బన్ : నవయుగ ధన్వంతరి, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు మానవాళి ఆరోగ్యానికి చేసిన కృషి చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. యల్లాప్రగడ సుబ్బారావు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సూర్యనారాయణతోపాటు వైద్యులను ఘనంగా సత్కరించారు.

రామన్నగూడెంలో సంక్రాంతి సంబరాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, ఫ్యాషన్ షో, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. 150మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు గ్రామ సర్పంచ్ చింతా వెంకట్రావు, ఉప సర్పంచ్ పాలడుగుల కృష్ణ బహుమతులు అందజేశారు. ఆర్‌ఎంజీ మహిళా గ్రూపు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో గ్రామ పెద్దలు పాలడుగుల రత్నాజీ, బోణం సుబ్బారావు, మద్దిపాటి రంగయ్య, రామతులసి, రాధ, రాణి, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన ద్వారకాతిరుమల గార్లిక్ వారు పాలూరి శివప్రసాద్ పేరున ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ సూపరింటిండెంట్ హయగ్రీవ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అనంతరం వారికి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

సకల జనుల సమ్మేళన పాదయాత్ర



సకల జన సమ్మేళన పాదయాత్రలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించారు. తొలుత ఆయనకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సభలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 16 నుంచి 17 నెలల పాటు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. 2014 ఎన్నికల్లో పవన్ మాట నమ్మి చంద్రబాబుకు ఓటేస్తే ఏం చేశాడని ప్రశ్నించారు. అందరికీ అన్యాయం చేశాడన్నారు. పవన్‌ను డబ్బులతో చంద్రబాబు లోబర్చుకున్నాడని విమర్శించారు. బీసీలను ఏనాడూ చంద్రబాబు గుర్తించిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చిన పాపానపోలేదన్నారు. నాడు జన్మభూమి కమిటీల చేతుల్లోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉండేవన్నారు. వారు చెప్పిన వారికే పథకాలు వర్తించేవని దుయ్యబట్టారు. జగన్ పాలనలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి, కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. చదువుకునే కుర్రాళ్లను పవన్ చెడుగొడుతున్నారన్నారు. ఇటీవల మాధవరం గ్రామంలో జరిగిన సంఘటనను ప్రస్తావించారు. ఇప్పటికైనా, తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలన్నారు. పదో తరగతి పరీక్షలు పూర్తి కాగానే ఏప్రియల్ నెలలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా, ప్రజలు మంచి ఆలోచన చేసి, సుపరిపాలనకు జగన్‌ను తిరిగి ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైస్‌ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, ఏఎంసీ డైరెక్టర్ నీలపాల విజయలక్ష్మి, మద్దుకూరి మెహెర్ ప్రసాద్, బొద్దాని శ్రీనివాస్, కారింకి వీర్రాజు, శీలంశెట్టి బాలాజీ, చిట్టూరి కాశీవిశ్వనాథం, కొట్టు విశాల్, నీలపాల రామన్న, కొత్తపల్లి ప్రసాద్, దంగేటి నారాయణరావు, శీలంశెట్టి శివవెంకటేశ్వరరావు, కొత్తపల్లి అరుణ, పోలిమోను గోదావరి, పీఆర్ డీఈ వి.వేణుగోపాల్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలోని లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరు చేయాలని అమలాపురం ఎంపీ చింతా అనూరాధ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అనుమతి మంజూరు చేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల క్యాంస్య విగ్రహం ఏర్పాటు సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ నేతృత్వంలో రక్తదాన శిబిరం శుక్రవారం అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగింది. యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ జనవరి 19వ తేదీన ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనాలని కోరారు. రక్తదాన శిబిరం స్ఫూర్తిని ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగజ్జీవన్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ, జిల్లా వైద్య అధికారి మహేశ్వరరావు, సీజీఎఫ్ కమిటీ సభ్యులు కర్రి భాస్కరరావు, ఏరియా ఆసుపత్రి కమిటీ సభ్యులు కొలుకులూరి ధర్మరాజు, వార్డు ఇంచార్జిలు చింతకాయల సత్యనారాయణ, చామన సూర్యచంద్రరావు, ఆరుమిల్లి రవి, అడ్డాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా



పెంటపాడు: క్రికెట్ ఆడుతున్న మహిళలు

పెంటపాడు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని ఎంఈఓ టి.వి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పెంటపాడు బేసిక్ స్కూల్, ఎస్‌టీవీఎస్ హిందూ హైస్కూల్, డి.ఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మండల స్థాయి ఆడుదాం -ఆంధ్ర క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. మహిళల కబడ్డీ, ఖోఖో క్రికెట్ తదితర పోటీల్లో పలు గ్రామాల టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ క్రీడలను పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, తహసీల్దార్ జీవి శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, రెవెన్యూ ఆర్ఐ కనకదుర్గ, పార్టీ నాయకులు బర్ల జయరామ్‌బాబు, నల్లిమిల్లి అంజిరెడ్డి, బందారు రాంబాబు, ఉండ్రాజవరపు రాజు తదితరులు పర్యవేక్షించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి, మాధవరం గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శుక్రవారం కొనసాగాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ విభాగాలకు సంబంధించి మొత్తం 40 టీమ్‌లు తలపడ్డాయి. పీఈటీలు నాగార్జున, సాయి హరనాథ్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, కే.వెంకటేశ్వరరావు, డి.చంద్రశేఖర్, ఆర్.శివలీల, ఎం.సురేష్, పీఈటీలు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శం



స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శనీయమని పలువురు వక్తులు పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకనంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, జీకే ఆనంద్, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

స్వామి వివేకానంద జయంతిని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు దూలం నాగరాజు అధ్యక్షతన వాకర్స్ భవనం వద్ద వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గురుమూర్తి, కోశాధికారి సారథి, బాకా వెంకటేశ్వరరావు, అనిల్, షర్మిల, డాక్టర్ కంచర్ల తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని పట్టణంలో నిర్వహించారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తుమరాడ చిన్న, నాయకులు కేశవభట్ల విజయ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు స్ఫూర్తి కావాలి

తణుకు టౌన్: భారత నవయుగ వైతాళికుడు స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలని తణుకు సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్‌చౌదరి, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

ఉందుర్తి పాల్ ఫౌండేషన్‌కు స్వామి వివేకానంద పురస్కారం



విజయవాడలో లక్ష్మీపార్వతి, కొమ్మినేని శ్రీనివాసరావు చేతులమీదుగా అవార్డు అందుకున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకుకు చెందిన ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్‌కు స్వామి వివేకానంద జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. విజయవాడ హోటల్ ఐలాపురం కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి, ఏపీ స్టేట్‌మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చేతులమీదుగా అవార్డును అందుకున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ ఉందుర్తి ప్రసన్నకుమార్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవాకార్యక్రమాలకు ఈ పురస్కారం దక్కినట్లు వివరించారు.

దాళ్వా సాగుపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన క్రిష్ణప్రసాద్

పెంటపాడు: దాళ్వా సాగును త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన క్రిష్ణప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై జింక్ సల్ఫేట్ సరఫరా చేయాలని కోరారు. అకాల వర్షాల్లో దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించాలని, దాళ్వా పూర్తి అయ్యే వరకు సాగునీరు నిరంతరం అందించేలా అధికారులు పూర్తి శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పీ మురళీక్రిష్ణ, సభ్యులు కునుకు పులయ్య, తాడి భాస్కరరావు, బుద్దన చంటి, జాలపర్తి నాగేశ్వరరావు, గుండుమోగుల మునిరత్నం, వ్యవసాయాధికారి పార్ధశారధి పాల్గొన్నారు.

వైభవంగా దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం



దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని బలుసులమ్మ ఆలయం వద్ద దుర్గామల్లేశ్వరస్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సతీమణి సౌదామిని దంపతులు స్వామి వారి కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించి పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి వచ్చిన ఉపప్రధాన అర్చకులు బి శాండిల్య, అచ్చుకులు సుప్రసిద్ధ వేదపండితులు కూచిభట్ల నర్సింహమూర్తి, (సామవేదం), వీరుభట్ల ఫణికుమారశర్మ, (యజుర్వేదం), ఒగేటి రమేష్‌బాబు, డి శ్రీనివాస్, యు శ్రీనివాస్, రవితేజ, గణేష్‌లు వేదపారాయణం, దివ్య మంత్రోచ్ఛారణలతో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలుసులమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, పట్టణ కన్వీనర్లు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, వట్టిపోలు రాము, సింగం సుబ్బారావు, చామన ప్రసాద్, అడ్డాల నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కుడారై ఉత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక శ్రీనివాస రామాలయంలో శుక్రవారం గోదాదేవికి కుడారై ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవికి విశేష ప్రసాద నివేదన చేశారు. చైర్మన్ శానం రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

పోడూరు: ఓటర్లందరూ ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు కోరారు. మండలంలోని కొమ్ముచిక్కాల, వేడంగి, వేడంగిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.రాంబాబు, సర్పంచ్‌లు, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.